గురుకులాలను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్

- బీఆర్‌ఎస్వీ నాయకులు

పాఠశాలలోకి బీఆర్‌ఎస్వీ నాయకులు రాకుండా అడ్డుకుంటున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

తుంగతుర్తి, డిసెంబర్ 5: రాష్ట్రంలోని గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శిగ వెంకటేశ్ గౌడ్, జిల్లా కోఆర్డినేటర్ కల్లెట్ల పల్లి శోభన్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రం లోని తెలంగాణ గురుకుల బాలుర పాఠశాలను బీఆర్‌ఎస్వీ గురుకుల బాటలో భాగంగా సందర్శించేందుకు వచ్చిన వారిని పాఠశాలలోకి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోమ్లా నాయక్ అనుమతించకపోవడంతో పాఠశాల గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలం లోనే రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో, ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులు చాలామంది మరణించారని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కేసీఆర్ సంపదను పెంచి ప్రజలకు పంచితే, రేవంత్‌రెడ్డి సర్కార్ మాత్రం ప్రజలను ముంచి దోచుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు గునిగంటి సంతోశ్‌గౌడ్, వడ్డేపల్లి సందీప్, వేల్పుకొండ రామకృష్ణ, మెండే సురేశ్, మట్టపల్లి వెంకట్, గోపగాని శ్రీను, గోపగాని వెంకన్న, ఉప్పుల నాగమల్లు, కొండగడుపుల వెంకటేశ్, తడకమళ్ల మల్లికార్జున్, నల్లబెల్లి వెంకటేశ్, తాటిపాముల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన అంటే అప్రజాస్వామిక అరెస్టులా?

- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 5: ప్రజాపాలన అంటే ప్రతిపక్ష నాయకుల అప్రజాస్వామిక అరెస్టులా అని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావును అరెస్టు చేయడాన్ని గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇచ్చిన హామీలను అమలు చేయడానికి చేతకాక ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరంకుశ వైఖరిని అవలంబిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసినంత మాత్రాన ప్రశ్నించడం ఆగుతుందనుకుంటే అది అజ్ఞానమే అన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుంటే తీవ్ర ఛీత్కారం ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వెంకటచంద్ర

మఠంపల్లి: మాట్లాడుతున్న వెంకటచంద్ర

మఠంపల్లి, డిసెంబర్ 5: సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వమే అరికట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగెళ్ల వెంకటచంద్ర అన్నారు. గురువారం అంతర్జాతీయ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మఠంపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు సెమినార్ నిర్వహించారు. ఇటీవలి కాలంలో మహిళలపై హత్యాచారాలు, గృహహింస దాడులు ఎక్కువవుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేసి నిందితులకు వెంటనే శిక్షలు విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సౌజన్య, దివ్య పాల్గొన్నారు.

చివ్వెంల: మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ జడ్పీహెచ్‌ఎస్‌లో అంతర్జాతీయ హింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు, లైంగిక దాడులు, వేధింపులు, ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కవిత, ఐద్వా జిల్లా కోశాధికారి మేకనబోయిన సైదమ్మ, పిండిగ నాగమణి, ఆవుదొడ్డి భాగ్యమ్మ పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు సుందరి రమాదేవి, ఇందిరాల త్రివేణి, సుశీల, భూతం సరిత, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలి'

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 5: రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆటో యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 7న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని సూర్యాపేట ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుర్రి సైదులు, ప్రధాన కార్యదర్శి అహ్మద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సూర్యాపేటలో గురువారం ఆటోల బంద్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు హామీలు అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు గుండె వెంకన్న, ఖుషి వెంకన్న, పోతరబోయిన శ్రీనివాస్, బొడ్డు సురేశ్, కరుణాకర్, రాపర్తి రాజు, ఎండీ.అహ్మద్, మధు, సోమగాని బిక్షపతి పాల్గొన్నారు.

'హమాలీల వయో పరిమితిని ఎత్తివేయాలి'

నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 5: వ్యవసాయ మార్కెట్ హమాలీలకు విధించిన 55 ఏళ్ల వయో పరిమితిని ఎత్తివేయాలని తెలంగాణ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ హమాలీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో ఎగుమతి, దిగుమతి చేసే హమాలీలను నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పీఎఫ్, ఈఎస్‌ఐ, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు వంటివి వర్తింపజేయాలని కోరారు. ఉచిత క్యాంటిన్, విశ్రాంతి భవనం, మార్కెట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మహిళా స్వీపర్లు, డబ్బా కార్మికులకు రవాణా ఛార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. హమాలీ యూనియన్ అధ్యక్షుడు లింగానాయక్, దస్రునాయక్, శంకర్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ఒరిజినల్ ఇంటి డాక్యుమెంట్స్ పోయినవి
షేక్ షరీఫ్ పాష, S/o. నాగూర్‌వలీ బంగారిగడ్డ, మిర్యాలగూడ నాకు సంబంధించిన ఒరిజినల్ ఇంటి డాక్యుమెంట్స్ నెం.4251/1998 మరియు లింకు డాక్యుమెంట్ నెం.1573/1994 గలవి మోటార్ బైక్‌పై వెళుతుండగా మిర్యాలగూడలో పోయినవి. దొరికినవారు సంప్రదించగలరు.
8886161289

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638

సీఎం కప్ క్రీడల్లో జిల్లాను ముందుంచాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, డిసెంబర్ 5: సీఎం కప్ పోటీల్లో జిల్లాను అన్ని విభాగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులకు సూచించారు. గురువారం జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలలో జరిగే సీఎం కప్ పోటీలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. డిసెంబర్ 7,8 తేదీల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో, 10,11,12వ తేదీల్లో మండల, పురపాలక సంఘం స్థాయిలో, 16 నుంచి 21 వరకు జిల్లాస్థాయిలో, 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయిలో క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 36 క్రీడా విభాగాల్లో జిల్లానే ముందుండాలని చెప్పా రు. జిల్లాలోని 23 మండలాలు, 486 పంచాయతీల్లో ఈ క్రీడలను నిర్వహించాలని చెప్పారు. యువజన క్రీడల అధికారి జి.రామచంద్రరావు, డీఆర్‌డీఓ అప్పారావు, డీపీఓ నారాయణరెడ్డి, సీపీఓ కిషన్, డీటీడీఓ శంకర్ పాల్గొన్నారు.

కుమారుడితో సహా తల్లి ఆత్మహత్యాయత్నం

- బాలుడు అయాన్ మృతి

హుజూర్‌నగర్ రూరల్, డిసెంబర్ 5: మండల పరిధిలోని లక్కవరం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఓ తల్లి తన కుమారుడితో సహా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి.. లక్కవరం గ్రామానికి చెందిన మమత ఏడాది వయసున్న తన కుమారుడు అయాన్‌తో కలిసి బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని బావిలో దూకింది. విధుల నిమిత్తం వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన మమత భర్తకు ఇంటి వద్ద వారిద్దరు కనిపించకపోవడంతో గ్రామస్తులతో కలిసి వెతికాడు. బావి వద్దకు వెళ్లి చూడగా మమత నీటిలో కొట్టుమిట్టాడుతూ కనిపించింది. దీంతో ఆమెను కాపాడారు. అప్పటికే అయాన్ మృతి చెందాడు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ నవ వధువు మృతి

మేళ్లచెర్వు, డిసెంబర్ 5: మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలై చికిత్సపొందుతున్న మహిళ గురువారం మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన రాసూరి ఉపేందర్ (38)కు మేళ్లచెర్వు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన రత్నకుమారి(34)తో గత శుక్రవారం వివాహం జరిగింది. కాగా, గత సోమవారం ఉపేందర్ తన భార్యతో కలిసి అత్తవారింటికి వెళ్తుండగా మేళ్లచెర్వు శివారులో పొద్దుపోయాక వారు ప్రయాణిస్తున్న బైక్ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేందర్ అక్కడికక్కడే మృతిచెందగా, రత్నకుమారి తీవ్రంగా గాయపడి ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది.

దొంగ అరెస్ట్.. బంగారు ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 5: ఓ అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జనగామ పట్టణంలోని రాజీవ్ నగర్‌కు చెందిన డ్రైవర్ శీలం చెట్టి వెంకటరమణ అనే వ్యక్తి తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడేవాడు. 2021, 2022లో సూర్యాపేట పట్టణంలో రెండుచోట్ల, సూర్యాపేట మండలంలో ఒకచోట దొంగతనానికి పాల్పడ్డాడు. పట్టణంలోని హైటెక్ కాలనీలో దొంగతనానికి పాల్పడి బంగారం దొంగిలించగా, ఈ విషయమై 2022 అక్టోబర్ 28న బొబ్బల రాములు అనే వ్యక్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు గురువారం ఉదయం సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టణ సీఐ వీరరాఘవులు సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొని విచారించారు. అనేక దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లినట్లుగా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి రూ 15.20 లక్షల విలువైన 19 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై విజయవాడలో, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌ల పరిధిలో 30కి పైగా కేసులు ఉన్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు కృషి చేయాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి భానునాయక్

అధ్యాపకులతో మాట్లాడుతున్న భానునాయక్

నడిగూడెం, డిసెంబర్ 5: ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి భానునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల ప్రకారం 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అందరు అధ్యాపకులు తయారు చేయాలని సూచించారు. కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా కృషి చేయాలని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ విజయనాయక్, సీహెచ్.వాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో మందుల కొరత ఉండొద్దు

- డీఎంహెచ్‌వో కోటాచలం

సూర్యాపేట, డిసెంబర్ 5: సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో మందుల కొరత లేకుండా చూసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం సిబ్బందిని ఆదేశించారు. గురువారం జిల్లా జనరల్ ఆసుపత్రిలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులు, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసరమైన మందులను దిగుమతి చేసుకొని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కాలం చెల్లిన మందులను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటిని బయటకు రాకుండా చూసుకోవాలన్నారు. మందుల నిల్వను, స్టోరేజ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు

- పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు, డిసెంబర్ 5: ఈ నెల 30వ తేదీన నల్లగొండలో జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాలలో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో పార్టీ శతాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28వ తేదీలోపు పార్టీ సభ్యత్వాలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు రెమిడాల రాజు, తాళ్లూరి రామారావు, పోరుండ్ల ఉపేందర్, తాళ్లూరి పెద మల్లయ్య, సాహెబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, మాదరపు లక్ష్మయ్య పాల్గొన్నారు.

వ్యక్తి హత్య

మఠంపల్లి, డిసెంబర్ 5: ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. భీమ్లాతండాకు చెందిన పానుగోతు పాచ్య (31) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఆయనను గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో మోది హత్యచేశారు. అయితే, పాచ్యకు గత కొంతకాలంగా గ్రామంలో కొందరితో భూ, వ్యక్తిగత గొడవలు ఉన్నాయి. అదే హత్యకు కారణం కావొచ్చని గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

అర్వపల్లి, డిసెంబర్ 5: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలైన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన దావుల సోమయ్య, శోభ దంపతులు సొంత ఆటోలో సూర్యాపేట నుంచి వెలుగుపల్లికి వెళ్తున్నారు. ఆటో బొల్లంపల్లి గ్రామ శివారులో చెరుకుబాయి సమీపంలోకి రాగానే తుంగతుర్తి నుంచి అర్వపల్లి వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

వివిధ కేసుల్లో 150 మందికి జరిమానా

హుజూర్‌నగర్, డిసెంబర్ 5: వివిధ నేరాలకు సంబంధించిన కేసులలో గురువారం హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ 150 మందికి జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రోడ్డు ప్రమాదాలకు కారకులవడం, జూదం ఆడడం, వీధి ఘర్షణలకు పాల్పడడం వంటి వివిధ నేరాలలో నిందితులు కోర్టుకు హాజరయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దిరాల, డిసెంబర్ 5: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్ఐ వీరన్న తెలిపారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పులిగిళ్ల లింగయ్య గురువారం తన ట్రాక్టర్‌తో పాలేరు వాగు నుంచి మద్దిరాలకు ఇసుక తరలిస్తుండగా ముకుందాపురం లో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నీటిని విడుదల చేయాలి

తిరుమలగిరి, డిసెంబర్ 5: యాసంగి సాగుకు ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు విడుదల చేయాలని బండ్లపల్లి గ్రామ బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు భాస్కర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యాసంగి సాగు మొదలైనా ఇప్పటి వరకు ప్రభుత్వం నీటి విడుదల షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం, నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి నీటి విడుదల షెడ్యూల్ విడుదల చేయాలని అన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా అభినయ్

అభినయ్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 5: తెలంగాణ యువజన కాంగ్రెస్‌కు ఇటీవల ఓటింగ్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన 15వ వార్డు కౌన్సిలర్ ఎల్మినేటి అభినయ్ 6,440 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన గెలుపునకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గడ్డివాము దగ్ధం

మోతె, డిసెంబర్ 5: మండలంలోని రాఘవపురం ఎక్స్ రోడ్డులో గురువారం బానోతు రవి అనే రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. రోడ్డుపై వెళ్లే వరకు సిగిరెట్ తాగి గడ్డివాము దగ్గర వేయడంతో మంటలు చెలరేగి 300 మోపుల గడ్డి దగ్ధమైనట్లు రైతు తెలిపాడు. స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

ఎమర్జెన్సీని తలపిస్తున్న కాంగ్రెస్ పాలన

- మాజీ జడ్పీటీసీ అనితాఅంజయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ మామిడి అనితా అంజయ్య

పెన్‌పహాడ్, డిసెంబర్ 5: రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలనను చూస్తుంటే ఇందిరా గాంధీ కాలం నాటి ఎమర్జెన్సీ రోజులే గుర్తుకొస్తున్నాయని పెన్‌పహాడ్ మాజీ జడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య అన్నారు. గురువారం మండలంలోని అనంతారం గ్రామంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, ఇది రజాకార్ల పాలన కంటే దారుణమైన పాలన అని, ప్రశ్నించే గొంతుకలను నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిని అరెస్ట్ చేసి భయపెట్టాలనుకోవడం సీఎం మూర్ఖత్వమే అని పేర్కొన్నారు. రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు పొదిల నాగార్జున, బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు షేక్ మస్తాన్, మండల సీనియర్ నాయకులు చిట్టెపు నారాయణరెడ్డి, దండెపల్లి సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టాలి

- మాజీ జడ్పీటీసీ సైదిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి

హుజూర్‌నగర్ రూరల్, డిసెంబర్ 21: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఇందిరా గాంధీ హయాం నాటి ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోందని మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అమరవరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం మాని పరిపాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ నబీ, మాజీ సర్పంచ్‌లు గుజ్జుల సుజాత అంజిరెడ్డి, రమ్య నాగరాజు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కామిశెట్టి వెంకటేశ్వర్లు, మండల నాయకుడు ఉస్తెల చిన్న లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులా?

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేశ్‌బాబు

సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్‌బాబు

నేరేడుచర్ల, డిసెంబర్ 5: రాష్ట్రంలో కొనసాగుతున్న అసమర్థ పాలనపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు అన్నారు. గురువారం స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులకు కేసులు కొత్త కాదని, ఉద్యమ సమయంలోనే కేసులకు భయపడలేదన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో రాక్షస పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పాలించడం చేతకాక పోలీసులను ఉసికొల్పుతూ ప్రశ్నించే వారిని అరెస్ట్ చేయిస్తున్నారని పేర్కొన్నారు. దీనికి నిదర్శనమే కౌశిక్‌రెడ్డిపైనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడమని తెలిపారు. కౌశిక్‌రెడ్డిని పరామర్శించడానికి వెళ్తున్న మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని ప్రజలు అంటున్నారని, ఇటీవల చేపట్టిన సర్వేలో సైతం కేసీఆర్ సీఎం కావాలని ఎక్కువ శాతం ప్రజలు కోరుకుంటున్నట్లు తేలిందన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, నియోజకవర్గ నాయకుడు బొడ్డుపల్లి సుందరయ్య, రాపోలు నవీన్‌కుమార్, మాజీ గ్రంథాలయ చైర్మన్ గుర్రం మార్కండేయ, నాయకులు ఇనపాల పిచ్చిరెడ్డి, హుస్సేన్, శ్రీనునాయక్, ఇంజమూరి రాములు, సోషల్ మీడియా ఇన్‌చార్జి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిర్బంధ పాలన

- బీఆర్‌ఎస్ తుంగతుర్తి మండలాధ్యక్షుడు సీతయ్య

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, డిసెంబర్ 5: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్బంధ పాలన సాగిస్తోందని, పోలీసులను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీ నాయకులను అక్రమ అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో కేసీఆర్ అడుగుజాడల్లో నడిచి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నాయకులను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రతిపక్ష నాయకులపై ప్రభుత్వం చేస్తున్న కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపగాని శ్రీను, పోడేటి లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రుల అరెస్ట్ అప్రజాస్వామికం

- బీఆర్‌ఎస్ మద్దిరాల మండలాధ్యక్షుడు రజాక్

మద్దిరాల, డిసెంబర్ 5: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చూస్తుంటే ఆనాటి ఎమర్జెన్సీ రోజులే గుర్తుకు వస్తున్నాయని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.ఏ.రజాక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది ప్రజాపాలన కాదని.. నిర్బంధ పాలన అని మండిపడ్డారు.

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 5: వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పొరేట్ కళాశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఆయా కాలేజీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక 60 ఫీట్ల రోడ్డులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుల్లూరి సింహాద్రి, ఎం.చందర్‌రావు మాట్లాడుతూ.. నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ర్యాంకుల కోసం, ధనార్జనే ధ్యేయంగా విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రతి ఏటా వందలాది విద్యార్థులు చనిపోతున్నారని ఆరోపించారు. చనిపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, వెంటనే విద్యా శాఖకు మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, నాయకులు సంధ్య, మానస, స్వప్న, నందిని, వర్షిత, మహేశ్, పవన్, వినయ్, సాయి, వేణు పాల్గొన్నారు.